



అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం..అంతా ఎదురు చూస్తున్న అయోధ్య రాముని ప్రతిష్ఠా మహోత్సవం రానే వచ్చింది.. ఆ దివ్య కార్యక్రమానికి మద్దతుగా జిల్లా అంతటా రామదండు కదిలింది.. ఎక్కడ చూసినా జై శ్రీరామ్ నినాదాలే.. ఇళ్లపై కాషాయ జెండాలు రెపరెపలాడాయి.. పురవీధుల్లో అయోధ్యరామ వైభవ యాత్రలు నిర్వహించారు..యువకులు బైక్ ర్యాలీలు చేపట్టారు.. రామనామ భజనలతో శోభాయాత్రలు చేశారు.. ప్రత్యేక పూజలకు రామాలయాలు ముస్తాబయ్యాయి.. అద్భుతమైన ప్రతిష్ఠా ఘట్టాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.. ఇప్పుడు ఎక్కడ చూసినా రామనామ జపమే..

జై శ్రీరామ్

అంతటా రామనామ జపం

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ వేళ జిల్లాలో శోభాయాత్రలు

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు

సాక్షాత్కరించు చుంటివా రామ !

ఎన్ని ఎదురుచూపులో ! కన్ను లెంత లెంత
కాయలాయెనో ! తుదకు సాక్షాత్కరించు
చుంటివా రామ ! నేడి ట్లయోధ్యలోన
భారతధరిత్రి పున్నెంబు లేరుకొనెను

అదిగో ! సరయూనదీ ప్రవాహమ్మునుండి
వినబడెడి గలంగలలకు వేడ్కజెంది
అనువుగా అందె నవరించుకొనెను నేడు
భారతీయాత్మ ! రావె ! ఇక్ష్వాకు రామ !

శబరియై వేదభువి నిను స్వాగతించె
కలలు ఫలియింపగ .. ప్రతి ముఖమ్ము రామ
మందిరంబై ప్రమోదించె.. మలుపు తిరిగె
రామ ! తాత్త్విక జగతి ! నీరాజనములు !

- రసరాజు

నరసాపురం, జనవరి 21: జిల్లాలో ఆయోధ్య రామాలయ ప్రారంభోత్స సందడి నెలకొంది. ఇప్పటికే ప్రధాన రామాలయాలన్నీ ముస్తాబయ్యాయి. ఆయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ముహూర్తం ప్రారంభ సమయంలో జిల్లాలోని రామా లయాల్లో కల్యాణం, భజనలు, హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు, అన్నసమారాధనలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే కొన్ని ఆలయాల వద్ద పందిర్లు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. అన్నసమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రసిద్ధిగాంచిన అన్ని రామాలయాల్లో ఈ పూజా కార్యక్రమ వేడుకలు జరగనున్నాయి. మరోవైపు రెండు రోజులుగా జిల్లాలో ఎక్కడ చూసినా ఆయోధ్య సందడే నెలకొంది. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు, తరలివస్తున్న ప్రముఖులపైనే చర్చిస్తున్నారు. ఆయోధ్యకు సంబంధించిన వీడియోలు, రామనామ భజనలు, తరలి వెళ్తున్న భక్తుల వీడియోలు, ఇళ్లల్లో రామమందిరాల ఏర్పాటు, ఇంటిపై కాషాయి జెండాలు, సీతారాములు, హనుమాన్‌కు సంబంధించిన ఆధ్యాత్మిక పాటల వీడియోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఈ వేడుకను స్వయంగా చూసేందుకు ఇప్పటికే జిల్లా నుంచి చాలామంది భక్తులు ఆయోధ్య తరలివెళ్లారు. మరోవైపు ఈ వేడుకను భక్తులంతా తిలకించే విధంగా కొన్నిచోట్ల ఎల్ఈడీలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



ఉండిలో యాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు



నరసాపురం మండలం వైఎస్ పాలెంలో ..



పాలకొల్లులో అయోధ్యరామ వైభవ యాత్ర

వైభవంగా శోభాయాత్రలు

పాలకొల్లు టౌన్ : ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాలకొల్లు పురవీధుల్లో వైభవంగా అయోధ్యరామ వైభవ యాత్ర నిర్వహించారు. జైశ్రీరామ్ నామంతో రాసిన 60 మీటర్ల పతాకాన్ని భక్తులు ఇరుపక్కలా పట్టుకుని సీతారాములు, లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల నామాలను గానం చేస్తూ జైశ్రీరామ్ నామస్మరణతో చేపట్టిన ఈ యాత్ర పాలకొల్లు పురవీధుల్లో శోభాయమానంగా జరిగింది.

హనుమత్ వాహనంపై ఊరేగిన శ్రీరాముడుకి ఇంటింటా భక్తులు హారతులు ఇచ్చారు.

గొల్లలకోడేరులో..

పాలకోడేరు : గొల్లలకోడేరులో గ్రామ యువత ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర గ్రామంలోని అన్ని వీధుల్లో జైశ్రీరాం నినాదాలతో హోరెత్తిస్తూ సాగింది. సోమ వారం గ్రామంలోని శివాలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, సాలా మల్లేశ్వరరావు, తంగెళ్ళ శ్రీను, మురళి, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర పంచ గ్రామాల్లో

పెనుమంట్ర : శ్రీరాముని కటౌట్ ఏర్పాటు చేసి పెనుమంట్ర మండలంలోని పంచ గ్రామాల్లో హిందువులు శోభా యాత్ర వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, కేరళ డప్పుల వాయిద్యాలు నడుమ శోభా యాత్ర గ్రామపురవీధుల్లో సాగింది. ప్రతి గ్రామంలోనూ ఇంటి గోడలపై శ్రీరామ్ స్టిక్కర్లను అతికిస్తున్నారు. ఇంటిపై కాషాయ జెండాలు ఎగురవేశారు.



తణుకు శోభాయాత్రలో నృత్య ప్రదర్శనలు

ఉండిలో..

ఉండి : ఉండి పెద్దవంతెన సెంటర్‌లోని శ్రీరామక్షేత్రం నుంచి రాజులపేట శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంజజ్జూజీ వైభవంగా శోభయాత్ర జరిగింది. చిన్నా పెద్దా అంతా శ్రీరామ నామ సంకీర్తనలతో గ్రామంలో తిరిగారు. సోమవారం చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అయోధ్యలో ప్రతిష్ఠా మహోత్సవం ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. అర్చకులు సన్నిదిరాజు కృష్ణ, చలపతిరావు, నల్లా కృష్ణప్రసాదు, ఆనంద మాస్టారు, సుబ్బారావు, కాగిత బుజ్జి, నాగబాబు, వాసు, రాఘవ పాల్గొన్నారు.

108 దంపతులతో రామనామ జపయజ్ఞం

నరసాపురం టౌన్ : నరసాపురం జగన్నాథస్వామి గోశాలలో ఆయోధ్య రామాలయ మందిర ప్రారంభోత్సవం పురస్కరించుకుని అదివారం గోశాల, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 108 మంది దంపతులతో రామనామ జపయజ్ఞం నిర్వహించారు. వేద పండితుడు అనిల్ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, కొవ్వలి నాయుడు, కొత్తపల్లి నాని, బీజేపీ నాయకులు గునిశెట్టి శ్రీను, మునికోటి వెంకటేశ్వరావు, జోశ్యుల ప్రతాప్, కిషోర్, నాగేంద్ర పాల్గొన్నారు.



తణుకులో సీతారాముల కల్యాణం

తణుకు : తణుకు పట్టణంలో అయోధ్య శ్రీరామ వైభవ యాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేల్పూరు రోడ్డులోని వీరనారాయణ థియేటర్ సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో సీతారాములు విగ్రహాలతో మేళతాళాలు, కోలాట నృత్యాలు, శ్రీరామ నామ కీర్తనలతో శోభాయాత్ర సాగింది. యాత్ర నరేంద్ర సెంటర్ మీదుగా ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ వరకు సాగింది. కళాశాల ప్రాంగణంలో రాత్రి సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

కొలువాయె.. కోదండరామా
జిల్లాలో ప్రసిద్ధ ఆలయాలు.. 7



అయోధ్యలో సరస్వతుల హనుమంతురావు కచేరి



పెంటపాడు : ఆయోధ్య రామమందిర ప్రారంభోత్సవంలో పెంటపాడు మండలం బోడపాడు గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ, ఘట విద్వాంసుడు సరస్వతుల హనుమంతురావుకు అరుదైన గౌరవం దక్కింది. 25 రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో జరుగుతున్న ఘటవాద్య కచేరిలో హనుమంతురావుకు అవకాశం లభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి హనుమంతురావు ఒక్కరికే ఈ అవకాశం లభించినట్లు బోడపాడు వాసులు తెలిపారు.



తణుకు శోభాయాత్రలో మోదీ రూపంలో ఉన్న వ్యక్తితో రామభక్తులు



పెనుమంట్రలో యాత్ర నిర్వహిస్తున్న భక్తులు



గొల్లలకోడేరులో బైక్ యాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

మేం కట్టలేం !



చేతులెత్తేసిన కాంట్రాక్టు ఏజన్సీలు

పునాదుల్లో నిలిచిపోయిన జగనన్న ఇళ్లు

నిర్మాణ భారంతో వెనుకంజ

భీమవరంలో అదనపు సొమ్ము వసూలు

నెరవేరని పేదోడి సొంతింటి కల

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పట్టాలు ఇచ్చేశాం. ఉచితంగా ఇళ్ల నిర్మిస్తున్నామంటూ ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గొప్పలు చెపుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే అందుకు భిన్నంగా ఉన్నాయి. కాంట్రాక్టర్‌లు చేతులెత్తేశారు. నిర్మాణం గిట్టుబాటు కాదన్న ఉద్దేశంతో ముఖం చాటేశారు. అధికారులు ఒత్తిడి తెస్తున్నాసరే దారికి రావడం లేదు. ప్రధాన మంత్రి ఆవాస యోజనలో జిల్లా వ్యాప్తంగా 72 వేల ఇళ్లకు శ్రీకారం చుట్టారు. అందులో 11 వేలు ఇళ్ల ఆప్షన్ మూడులో ఉచితంగా నిర్మించి ఇవ్వాలి. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోలేమంటూ స్పష్టం చేశారు. వాస్తవానికి లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మించుకోవాలంటూ వలంటీర్ల ద్వారా ఒత్తిడి తెచ్చారు. చేతిలో సొమ్ములు లేకుండా ఎలా నిర్మించేది అంటూ లబ్ధిదారులు మౌనం దాల్చారు. ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దాంతో ఆప్షన్ మూడుపై లబ్ధిదారులు సంతకాలు పెట్టేలా హౌసింగ్ కార్పొరేషన్ చర్యలు తీసుకుంది. నిర్మాణ బాధ్యతలను కాంట్రాక్టర్‌లకు అప్పగించింది. పునాదుల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఆ తర్వాత వర్షాలు అన్నారు. ఇప్పుడు రహదారులు లేవు. సామాగ్రి పంపలేమంటూ ఏదో కారణం చెపుతున్నారు. అంతిమంగా గిట్టుబాటు కాదన్న ఉద్దేశంతో వెనక్కు తగ్గిపోయారు. ఆ తర్వాత కానబడకుండా పోయారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు వీరిది

ప్రధానమంత్రి ఆవాస యోజనలో కేంద్రమే రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తోంది. మరో రూ. 35 వేలు డ్వాక్రా సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు రుణం రూపేణా మంజూరు చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తాము సొంతం గానే నిర్మిస్తున్నామంటూ గొప్పలు చెపుతోంది. నిధులు మాత్రం కేంద్ర ప్రభుత్వానివి. ఇదే విషయమై ఇటీవల బీజేపీ క్షేత్ర స్థాయిలో వికసిత్ భారత్ పేరుతో ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది. సెంటు స్థలాన్ని మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది.

సెంటు స్థలంలో ఎలా

పట్టణాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం సెంటు స్థలాన్నే కేటాయించింది. అదికూడా గ్రామీణ ప్రాంత పరిధిలో భూములు సేకరించి ఇచ్చింది. పట్టణానికి దూరభారంగా స్థలాలు ఇవ్వడంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. అటువంటి వారంతా మూడో ఆప్షన్‌కు మొగ్గు చూపుతున్నారు. సొంత నిర్మాణాలకు ఆసక్తి చూపడం లేదు. సెంటు స్థలంలో సొంతంగా ఇళ్ల నిర్మించుకున్న వారంతా ఇప్పుడు ఈసురోమంటున్నారు. పెట్టుబడి రూ. 6 లక్షలు పైనే అయ్యింది. అక్కడ నుంచి పట్టణానికి రావాలంటే కష్టంగా ఉంటోంది. ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. సొంతింటికి వెళ్లలేకపోతున్నారు. అద్దె ఇళ్ల భారమై కూర్చుంది. లక్షలు పెట్టుబడి చేసి ఇళ్ల నిర్మించుకున్న వారు ఇప్పుడు దిక్కులు చూస్తున్నారు. అదికూడా సెంటు స్థలం మాత్రమే కేటాయించడంతో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉండేందుకు అవకాశం లేకండా పోతోంది.

ఫేజ్-3లో ఇలా..

ప్రధానమంత్రి ఆవాస యోజనలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మూడు విధానాలు అమలు చేస్తోంది. మొదటి ఎంపికలో ప్రభుత్వం రూ. 1.80 లక్షల విలువైన సామాగ్రి సరఫరా చేస్తుంది. రెండో విధానంలో లబ్ధిదారుల ఖాతాలో రూ.1.80 లక్షలు జమ చేస్తుంది. రెండు విధానాల్లోనూ లబ్ధిదారులే సొంతంగా ఇంటిని నిర్మించుకోవాలి. మూడో విధానంలో ప్రభుత్వమే నిర్మించి ఇస్తుంది. జిల్లాలో దాదాపు 11 వేల ఇళ్లకు సంబంధించి నిర్మాణ బాధ్యతలను కాంట్రాక్టు ఏజన్సీలకు అప్పగించారు. ప్రభుత్వ సొమ్మును ఏజన్సీల ఖాతాలో జమ చేశారు. ఆ సొమ్ముతో పునాదులు లేపారు.

భీమవరంలో అదనపు సొమ్ము వసూళ్లు

భీమవరంలో ప్రభుత్వానికి సంబంధం లేకుండా లబ్ధిదారులు ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఇళ్ల నిర్మిస్తామంటూ కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. తీరా రంగంలోకి దిగిన తర్వాత పీకల్లోతు నష్టాలు వచ్చాయి. దాంతో లబ్ధిదారులు రూ. 1.50 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకు న్నారు. అలా సొమ్ములు చెల్లించిన వారికి మాత్రమే ఇళ్ల నిర్మిస్తున్నారు. తణుకు, పాలకొల్లు, నర్సాపురం, ఆకివీడు ప్రాంతాల్లో ప్రభుత్వమే ఏజన్సీలకు అప్పగించింది. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు సరిపోవడం లేదు. నష్టాలు వస్తున్నాయి. అధికారులే ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారు. దీంతో ఏజన్సీలు ఇప్పుడు నిర్మాణాలకు దూరంగా ఉంటున్నాయి.

బడుగులపై ప్రేమ ఇదేనా

గతంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించేది. దాదాపు రూ. 2.50 లక్షలు లబ్ధి చేకూరేది. సొంతింటి కల సాకారమయ్యేది. అప్పట్లో ఇనుము, సిమెంట్ ధరలు తక్కువగా ఉండేవి. ఇసుక ఉచితంగా లభించేది. కేవలం రవాణా చార్జీలను మాత్రమే లబ్ధిదారులు భరించేవారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం నా బీసీలు, నా ఎస్సీలు అంటూ ఊదరగొడుతోంది. కానీ ఇంటి నిర్మాణ విషయంలో అదనంగా లబ్ధి ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మమ అనిపిస్తోంది. దీనివల్ల ఎస్సీ, ఎస్టీలు కూడా సొంతింటి కలకు దూరమవుతున్నారు.

జిల్లాలో పరిస్థితులు వేరు

జిల్లాలో మట్టి స్వభావం వల్ల ఇంటి నిర్మాణానికి అధిక మొత్తంలో వ్యయం అవుతోంది. లేఅవుట్ పూడిక కోసమే పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. ఇప్పటికీ జిల్లాలో భీమవరం, తణుకు వంటి ప్రాంతాల్లో లేఅవుట్‌లు పూడ్చలేదు. కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు. గిట్టుబాటు కావడం లేదని వెనుకంజ వేస్తున్నారు. మట్టి లభ్యత ఉండడం లేదంటూ చెప్పుకొస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధుల లేఅవుట్‌లకు మాత్రం మట్టి లభ్యమవుతుంది. తమ నియోజకవర్గాల పరిధిలో చెరువులు తవ్వకాలు సాగించినా మట్టి తవ్వకాలు చేపట్టినా ముందుగా ప్రజాప్రతినిధుల లేఅవుట్‌లకు వెళ్లాల్సిందే. ఈ పేరుతోనే కొందరు అధికార పార్టీ శ్రేణులు మట్టిదందాతో కోట్లు పోగేసుకున్నారు. కానీ లేఅవుట్‌లు పూడ్చలేదు. దానిని ఇప్పుడు ఏజన్సీలు సాకుగా చూపుతున్నాయి. పూడిక లేని లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మించలేమంటూ చేతులెత్తేస్తున్నాయి.

నేడు ఓటర్ల తుది జాబితా విడుదల

భీమవరం టౌన్, జనవరి 21 : పశ్చిగోదావరి జిల్లా ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. మూడు నెలలుగా కొత్త ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరించారు. పలుమార్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఎన్నికల సంఘ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా నివేదకను సమర్పించారు. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీ నాటికి ఫారం-6కు సంబంధించి 93,714 దరఖాస్తులు రాగా వాటిలో 91,561 ఆమోదించారు. ఫారం-7లకు సంబంధించి 1,00,211 దరఖాస్తులు రాగా 97,390 ఆమోదించారు. ఫారం-8కు సంబంధించి 1,26,769 రాగా 1,24,411 దరఖాస్తులను ఆమోదించారు. అధికారులు తుది జాబితాలో అర్హులను చేర్చి విడుదల చెయ్యనున్నారు.



పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

నరసాపురం, జనవరి 21 : న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం రాష్ట్ర సంఘం పిలుపు మేరక ముఖ్యమంత్రి నివాస ముట్టడికి నరసాపురం నుంచి వెళ్తున్న 17 మంది అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. పక్కా సమాచారంతో రైల్వే స్టేషన్‌లో వీరిని అడ్డుకొని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు స్టేషన్ వద్దకు వచ్చి అరెస్టును ఖండించారు. పోలీసుల చర్యపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.



హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడు. తండ్రిమాట జవదాటని ధీరుడిగా, ఆదర్శ పురుషుడిగా భక్తులు కొలుస్తారు. అయోధ్యలో నిర్మించిన రామాలయంలో నేడు శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య భక్తులు పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అంతటా శ్రీరామ నామ స్మరణే నెలకొంది. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని కొన్ని ప్రసిద్ధ రామాలయాల చరిత్రను తెలుసుకుందాం..

అంతటా రామ నామ స్మరణే..

మరో భద్రాద్రి.. సిద్ధాపురం కోదండ రామాలయం

» కొల్లేరు తీరంలో రామాలయం

ఆకివీడు రూరల్, జనవరి 21 : ప్రపంచ ప్రసిద్ధిగాం చిన కొల్లేరు సరస్సు తీరాన్న పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల సరిహద్దులో, పూర్వం అనేక మంది ఋషులు, సిద్ధులు తపస్సు చేసి సిద్ధిపొంది సిద్ధాపురంగా పేరుగాంచిన సిద్ధాపురం గ్రామంలో పడమర దిక్కుగా మరో భద్రాద్రిగా దర్శనమిచ్చే విధంగా ఆలయాన్ని నిర్మించారు. గ్రామ నడిబొడ్డున సుమారు పదకొండు ఎకరాల మంచినీటి చెరువు, పడమర గట్టున వందల ఏళ్ల చరిత్ర కలిగిన పెద్ద మర్రిచెట్టు ఉండేది. 1962-63 సమయంలో ఒక పెద్ద తుపాన్‌కు ఆ మర్రి చెట్టు నేలకొరగడం, ఈ ప్రాంతంలో ఆవుల మందలు సంచరిస్తూ ఉండడంతో 1965లో సుదీంద్రరామకృష్ణబాబుచే కోదండరామాలయం నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ప్రముఖ వాస్తుశిల్పి పద్మశ్రీ గణపతి స్థపతి, ఆగమ శాస్త్ర పండితులు శఠగోపాలాచార్యులు, వాస్తు శిల్పులు శ్రీనివాసాచార్యులు, శ్రీసుబ్బయ్య ఆధ్వర్యంలో ఇబ్రహీం పట్టణంలోని ఇంద్ర కీలాద్రి పర్వతశ్రేణి నుంచి తీసుకువచ్చిన శిలలతో ఆలయ నిర్మాణం చేసినారు. ఆలయంలో మూల విరాట్టులు తమిళనాడులోని రామనాధపురం జిల్లా కారైకుడి, కంచిలో తయారైనవి. 1995లో కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా మూలవిరాట్టులు ప్రతిష్ఠించబడ్డాయి. ప్రతి ఏటా శ్రీరామనవమి భద్రాచలానికి దీటుగా వేడుకలు చేస్తారని, ధనుర్మాసంలో కైంకర్యాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారని ప్రతీతి. శ్రీరామనవమి రోజున వేలాదిమందికి అన్నసంతర్పణతోపాటు పానకం పంపిణీ జరుగుతుంది. దూర ప్రాంతాల నుంచి అనేకమంది స్వామివారి దర్శనానికి తరలి వస్తారు. అయోధ్యలోని రాముడి ప్రతిష్ఠకు ఆలయంలోని అన్ని ఏర్పాట్లు చేసినట్లు, గ్రామంలో శ్రీరామనామ సంకీర్తన చేస్తూ ప్రసాద వితరణ చేస్తున్నట్టు దేవస్థానం చైర్మన్ భూపతిరాజు వెంకటేశ్వరరాజు తెలిపారు.



సిద్ధాపురంలో కోదండ రామాలయం

తూర్పుయడవల్లిలో చినభద్రాద్రి క్షేత్రం

ద్వారకాతిరుమల, జనవరి 21 : భక్తజన అభీష్ట ప్రదాయకుడైన జగదభిరాముడు రమ్యమోహనంగా కొలువుతీరిన క్షేత్రం తూర్పుయడవల్లి. ఒక దాత భక్తిసంకల్పానికి ఈ క్షేత్రం ఒక చిహ్నం. భద్రాచలంలో ఉన్న రీతిలోనే ఇక్కడ సీతాలక్ష్మణ సమేతంగా రాఘవుడు గర్భాలయంలో మూలవరులుగా కొలువుతీరి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. దాదాపు దశాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ క్షేత్రం చినభద్రాద్రిగా పేరొంది ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయంగాను, ఆధ్యాత్మిక సన్నిధిగా అలరాడు తోంది. జిల్లాలోనే విశిష్ట రామాలయంగా, ఆహ్లాదకరమైన ప్రకృతి పరిసరాల నడుమ ఆలయాన్ని ఎకరం విస్తీర్ణంలో కోటి రూపాయలు వెచ్చించి నిర్మించా రు. 52 అడుగుల ఎత్తుతో ప్రధాన గోపురం, 14 అడుగుల ఎత్తుతో సింహ ద్వారంతో ఈలోగిలి కళకళలాడుతోంది. ఆలయ ముఖ మండపంలో శిల్పకళా సౌందర్యాలతో పాటు మేషం నుంచి మీనం వరకూ 12 రాసులు, చిన్ని కృష్ణుని శిల్పం, పర్ణశాల మరింతగా వన్నె తెస్తున్నాయి.

2003 నుంచి శ్రీవారి దత్తత దేవాలయంగా..

ఈ ఆలయాన్ని అప్పటి మంత్రి కోటగిరి విద్యాధరరావు దంపతుల కృషితో చినజీయర్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయగా 2003లో ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తోంది. ఆలయ ప్రాంగణంలో వనవాస ఘట్టంలో శబరి చేతి నుంచి పండ్లు స్వీకరిస్తున్న రామలక్ష్మణులమూర్తులు సజీవ కళతో భక్తులను ఆకట్టుకుంటున్నాయి. రామాలయానికి అభిముఖంగా భక్తాంజనేయ సన్నిధి, ఆలయ ప్రాంగణంలో రాజ్యలక్ష్మి మాత, గోదాదేవి అమ్మవార్ల మూర్తులు పూజలందుకుంటున్నాయి. పాంచరాత్ర ఆగమ విధానంలో ఆలయంలో నిత్యోత్సవం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చైత్రమాసంలో శ్రీరామనవమి ఉత్సవాలు, సామ్రాజ్య పట్టాభిషేకం, జ్యేష్ఠ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పాంచాహ్నికంగా జరుపుతారు. ప్రతీనెల పునర్వసు నక్షత్రంలో శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తారు.



తూర్పుయడవల్లిలో రామాలయం



గర్భాలయంలో సీతా సమేత జగదభిరాముడు

పెనుమంట్రలో 150 ఏళ్ల రామాలయం

పెనుమంట్ర : పెనుమంట్ర గోస్తనీ నది పక్కన ఉన్న పురాతన రామాలయం సుమారు 150 ఏళ్ల క్రితం తోలేటి కైలాసరావు ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటినుంచి వారి కుమారుడు తోలేటి రామకృష్ణారావు వారి కుమారుల పర్యవేక్షణలో ఉంది. తోలేటి కైలాసరావుకు చెందిన తొమ్మిది ఎకరాల భూమిపై వచ్చే ఆదాయంతో ఆలయంలో దీప, నైవేద్యాల కోసం, బ్రాహ్మణుల పోషణ కోసం 1975 నుంచి ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వారు దూరప్రాంతంలో ఉండడం వల్ల ఆలయానికి సంబంధించి పనులను దాట్ల సత్యనారాయణరాజు, తండ్రి సత్యనారాయణరాజు చూస్తున్నారు. అర్చకులుగా గోవర్ధన వెంకటాచార్యులు పూజలు చేస్తున్నారు. సోమవారం ఉదయం అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్డి యువజన సంఘం తేతలి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి రామాలయం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పెనుమంట్రలో రామాలయం (ఇన్‌సెట్‌లో) విగ్రహాలు



వీరవాసరంలో సీతారామస్వామి ఆలయం

దేవాలయంలో మూలవిరాట్

భద్రాద్రి తరహాలోనే వీరవాసరంలో..

» నేడు సీతారామస్వామి ఆలయంలో నగర సంకీర్తనకు ఏర్పాట్లు

వీరవాసరం, జనవరి 21 :వీరవాసరంలో వందల ఏళ్లనాడే పూర్వీకులు భద్రాద్రి సీతారామస్వామి ఆలయం తరహాలోనే దేవాలయాన్ని నిర్మించారు. కాలక్రమేణ దీనిని పునఃనిర్మాణం చేశారు. స్వామివారికి ఏటా శ్రీరామనవమి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అన్ని పర్వదినాలలోనూ భక్తులు స్వామిని దర్శించుకుంటారు. దేవాలయంలోని మూలవిరాట్ సీతారామ లక్ష్మణతో కలిపి భద్రాద్రి తరహాలోనే కొలువై ఉంటారు. స్వామి సన్నిధిలో వివాహాలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఆయోధ్య రామాలయం ప్రారంభోత్సవం స్వామివారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పంపిణీ చేస్తున్న అక్షింతలను కూడా ఈ ఆలయం నుంచి గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. వీరవాసరం మండలంలో ఉన్న 23 ఆలయాలకు ఆయా ప్రాంతవాసు లకు అందజేసేలా అక్షింతలను అం దించారు. సమరసత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూపరిషత్, బీజేపీ నాయకులు ఈ ఆలయం వద్ద నుంచే పండుగ వాతావరణాన్ని తీసుకు వచ్చారు. ఆదివారం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున నగర సంకీర్తనకు సన్నాహాలు చేయగా గ్రామాల్లోని రామాలయాల్లో భజన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



ఏడీజే కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, సెషన్స్‌ను ప్రారంభించిన దృశ్యం

కోర్టును గౌరవప్రదంగా నిర్వహించుకోవాలి

» ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 21: చిరకాలంగా ఎదురుచూస్తున్న ఏడీజే కోర్టు ప్రారంభించామని ఆ కోర్టును గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో 11వ అడిషినల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ (ఏడీజే) కోర్టు, జడ్జి చాంబర్, ఆఫీస్ గదులు, సబ్ పోస్టాఫీసును ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనతోపాటు వచ్చిన హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి. గోపాలకృష్ణారావు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సి. పురుషోత్తంకుమార్, ఏడీజే హైకోర్టు ఇన్‌చార్జి బి.సత్యవతిలకు పోలీసులు గౌరవ వందనం అందించారు. కోర్టులో సర్వమత ప్రార్థనలు చేశారు. లా సెక్రటరీ జి. సత్యవరప్రభాకరరావు, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సూర్యకిరణ్‌శ్రీ, సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అన్నామణి, ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారికి ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి21: చినవెంకన్నకు క్షేత్ర పురవీధుల్లో ఆదివారం రాత్రి జరిగిన ఏకాదశి ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయ ప్రాంగణంలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పుష్పాలం కరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదఘోషల నడుమ శ్రీవారి వాహనం తిరువీధుల్లో విహరించింది. ప్రతీ ఇంటిముందు స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు పట్టారు.



క్షేత్ర తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ద్వారకాతిరుమల, జనవరి 21: కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ కార్యదర్శి నందూరి ఉమ పిలుపునిచ్చారు. ఆదివారం గుణ్ణంపల్లి జడ్పీ పాఠశాలలో సర్పంచ్ తానిగడప సుజాత ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు ఉన్న అవగాహన, పథకాల అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేసి పాలనా యంత్రాంగం కృషిని అభినందించారు. తొలుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో నానో డీఏపీ యూరియా వినియోగంపై డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శించారు. భారత్ ఆయుష్మాన్ ఐడీ కార్డు, మహిళా లబ్ధిదారునికి ప్రధాని ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆమెను పలువురు సత్కరించారు, కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీపీవో విశ్వనాథ శ్రీనివాస్, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకటకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ, అధికారులు పాల్గొన్నారు.



వికసిత్ సంకల్పయాత్ర సమావేశంలో మాట్లాడుతున్న నందూరి ఉమ



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మేనత్త, హాస్యనటుడు అల్లు రామలింగయ్య సోదరి ఆకుల సత్యవతి ఇటీవల మృతి చెందింది. ఆదివారం ఉదయం నిర్మాత అల్లు అరవింద్ పాలకొల్లు విచ్చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.
- పాలకొల్లు రూరల్

సంఘటిత ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం

» ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

వీరవాసరం, జనవరి 21 : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకోవడానికి సంఘటిత ఉద్యమాలు చేయాల్సిందేనని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం వీరవాసరం తులసీ కన్వెన్షన్‌లో పశ్చిమ గోదావరి జిల్లా 36వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సమస్యలపై రాజీలేకుండా, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పోరాటం చేస్తుంది ఒక్క ఏపీయూడబ్ల్యూజే మాత్రమేనని అన్నారు. రాష్ట్ర విభజన తరువాత నాటి సీఎం చంద్రబాబునాయుడుని కలిసి సమస్యలు వివరించామన్నారు. విభజిత రాష్ట్రంలో హెల్త్ స్కీమును ప్రభుత్వం అనుమతించిందన్నారు. ప్రమాద బీమాతోపాటు జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకానికి వంద కోట్ల బడ్జెట్ కేటాయించారని గుర్తు చేశారు. 2019లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కూడా జర్నలిస్టులు సమస్యలను వివరించే కార్యక్రమం చేపట్టి నా ఫలితంలేదన్నారు. కరోనా సమయంలో చనిపోయిన జర్నలిస్టులకు న్యాయం చేయాలని సంతకాలతో వినతి పత్రమిచ్చినా ఫలితం లేదని, చాలామంది అక్రిడిటేషన్లు కోల్పోయారని అన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, పోరాటాలను వివరించారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, చిన్న, మధ్య తరహా పత్రికల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రమణారెడ్డి, విజయవాడ ప్రెస్ క్లబ్ సీనియర్ నాయకుడు దారం వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజుశ్రీనివాసవర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, వీరవాసరం మండల పరిషత్ అధ్యక్షురాలు వీరవల్లి దుర్గాభవాని , టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. అనంతరం మహాసభ నిర్వహణకు పూర్తి సహకారం అందించిన వీరవాసరం జర్నలిస్టు గోపాలకృష్ణ, తులసి కన్వెన్షన్ సెంటర్ యజమాని మళ్ళ రాంబాబును ఘనంగా సత్కరించారు. తొలుత ఇటీవల కన్నుమూసిన పాత్రికేయులకు నివాళులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా శాఖ కార్యదర్శి వీఎస్ సాయిబాబు, గజపతి వర ప్రసాద్, కేవీ ప్రసాద్ మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నుంచి రెండు వందల యాభై మంది పాత్రికేయులు హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

31న ఆదికవి నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం

» గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం » పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

రాజమహేంద్రవరం, జనవరి 21: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 31న నిర్వహిస్తామని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నన్నయ వర్సిటీ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, మన్యం (సగభాగం) జిల్లాల్లోని 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎస్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకో త్సవం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేయనున్నారు. 13,14,15 స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్‌మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. వీరందరికి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. మరో ముఖ్యఅతిథి భారతీయ సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్, పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండ గలా నిర్వహించేందుకు వర్సిటీ అధ్యాపకులు, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వీసీ కోరారు.



నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

క్రైం సమాచారం

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

భీమడోలు, జనవరి 21 : మద్యం మత్తులో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం భీమడోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమడోలు గ్రామంలోని వెలంపేటలోని సొంత ఇంటిలోనే మద్యం మత్తులో గెడ్డాపు హేమంత్‌కుమార్(28) పలు మార్లు ఇంటిలోని వారితో తగువుపడుతూ గతంలో పలు మార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆదివారం తన నానమ్మతో గొడవ పడి ఉరి వేసుకున్నట్టు తెలిసింది. దీనిపై అతడి సోదరుడు గెడ్డాపు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమడోలు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లింగపాలెం, జనవరి 21: సింగగూడెంకు చెందిన ఓ వ్యక్తి పురుగుమందు ఘాటుకు చనిపోయినట్టు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. గ్రామానికి చెందిన గోగం రంగారావు(35) శనివారం పొలంలో పురుగుమందు పిచికారీ చేసి ఇంటికి వచ్చాడని, తల తిరుగుతూ వికారంగా ఉందని చెప్పి వాంతులు చేసుకున్నాడు. అతడి భార్య సుధారాణి తన కుటుంబసభ్యులకు తెలుపగా వెంటనే చింతలపూడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'అనారోగ్యంతోనే ఆత్మహత్య'

ఏలూరు క్రైం, జనవరి 21 : ఏలూరు పవర్‌పేట రైల్వే గేటు సమీపంలో ఈనెల 20వ తేదీ సాయంత్రం అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. ఏలూరు లంకపేటనకు చెందిన ములపర్తి విజయ్‌బాబు(30) సోరియాసిస్ అనే చర్మ వ్యాధితో బాధపడుతూ కోలుకోలేక మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ మేరకు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 21 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న సిరిబత్తిన శివన్నారాయణ రాత్రివేళ మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అతడిని అరెస్టు చేసి, ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఈబీ సర్కిల్‌లో 414 కేసులు నమోదు

చింతలపూడి, జనవరి 21 :చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2023లో 414 సారా కేసులు నమోదు చేసి 442 మందిని అరెస్టు చేశామని ఎస్ఈబి సీఐ సాయిస్వరూప్ ఆదివారం తెలిపారు. ఈక్రమంలో 2,525 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, 787 కిలోల నల్ల బెల్లాన్ని, 51 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 200 లీటర్ల ఎన్‌డీపీ మద్యం, 10 కిలోల గంజాయిని పట్టుకున్నామని, 515 మందిని బైండోవర్ కేసుల్లో నమోదు చేశామని, నలుగురిపై పీడీ యాక్టు నమో దు చేశామని, 52,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 :జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో బెల్ట్‌షాపులో మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ట్రైనీ డీఎస్పీ బి.విద్య ఆదివారం తెలిపారు. గ్రామంలో గంగాధరరావు అనే వ్యక్తి మద్యం సీసాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి అతడి వద్ద నుంచి రూ.710 విలువ చేసే రెండు మద్యం సీసాలు, రెండు బీర్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు దొంగిలించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పేరంపేట గ్రామంలో రైతు బి.గోపాలకృష్ణకు 97 సెంట్ల పొలం ఉంది. ఆదివారం పొలం వెళ్లి చూసే సరికి ఆ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు దింపి ఉండడాన్ని గమనించారు. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైరును దొంగిలించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రైనీ డీఎస్పీ విద్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

పెదపాడు, జనవరి 21 : పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశామని ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. వారి వద్ద వద్ద నుంచి రూ.3,220 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పెదపాడు పోలీసులు తెలిపారు.

శ్రీవారి ఆర్జిత సేవలకు ఆఫ్‌లైన్లోనూ టికెట్లు

ద్వారకాతిరుమల, జనవరి 21: చిన్నతిరుమలేశుని క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌తోపాటు ఇకపై ఆఫ్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభమయ్యాయి. కొంతకాలం క్రితం ఆలయంలో ఈ ఆన్‌లైన్ టికెట్టు విధానాన్ని ఆలయ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ సేవలు పొందే భక్తులు కొందరు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి వాటి పరిజ్ఞానం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. కొందరైతే మొక్కుబడులను చెల్లించకుండానే వెళ్లేవారు. కొంతమేర ఆర్జిత సేవల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. ఈ విషయాన్ని గమనించిన అధికారులు నిత్యకల్యాణ మండపం వద్ద భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందేందుకు కియోస్క్ మిషన్‌లను సైతం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్లు ఎలా పొందాలి అన్నదానిపై అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో తాజాగా ఆఫ్‌లైన్ టికెట్లను ఇవ్వడం పట్ల భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఎస్టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా శామ్యూల్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 21 : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంఘ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.శామ్యూల్, కె.ఆర్. పవన్‌కుమార్ ఎన్నికయ్యారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు, పోకడలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశం అనంతరం ఎస్టీయూ జిల్లా కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆర్థిక కార్యదర్శిగా జి.రామును ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా డీవీఏవీ. ప్రసాదరాజు, పీబీవీఎస్ఎల్. నారాయణ, పిఎస్. ప్రకాశరావు, బి.వి.బాలాజీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.జవహర్‌లాల్‌రాజు, పరిశీలకుడిగా కె.వి.రామచంద్రరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘ రాష్ట్ర నాయకులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న తాళ్ళపాలెం తేగలు, కాల్చుతున్న దృశ్యం

తాళ్ళపాలెం తేగలకు మహా డిమాండ్

» సైజును బట్టి వంద తేగలు రూ.500-600 వరకు
» ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్న తేగలు
» సీజన్‌లో అనేకమందికి జీవనోపాధి

గణపవరం, జనవరి 21: ఉమ్మడి పశ్చిమ జిల్లాల ప్రజలకు సంక్రాంతి పండుగ సమయం నుంచి ముందుగా గుర్తుకొచ్చేది తేగలు. ఎంతో మేలు చేసే పలు రకాల పోషకాలు ఉన్న తేగలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిసెంబరు నుంచి మార్చి వరకు చలికాలంలో మాత్రమే విరివిగా లభించే తేగలు చిన్న పిల్లలు, పెద్దవారు అమితంగా ఇష్టపడి తింటుంటారు. వర్షాకాలంలో రాలిపోయి పడిపోయిన తాటికాయల్ని భూమిలో పాతితే వచ్చే మొలకలే తేగలు. కుండలో నీరుపోసి తేగలను ఉడికించడం ఒక రకమైతే కేవలం నిప్పులపై కాల్చటం మరోవిధానం. నిప్పులు మీద కాల్చింది మంచి రుచిగా ఉంటుందని ఎక్కువగా ఇష్టపడతారు.

ఏలూరు జిల్లాలోని మెట్ట, పశ్చిమ గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతాల్లో పుష్కలంగా లభిస్తుంటాయి. గణపవరం మండలంలోని తాళ్ళపాలెం తేగలంటే ఓ ప్రత్యేకత ఉంది. ఈ తేగలు రుచి, నాణ్యతగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి ఇష్టంతో తింటారంటే అతిశయోక్తి కాదు. తెలంగాణలోని హైదరాబాదు, చెన్నై, ముంబై, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, బెంగళూరు, తదితర రాష్ట్రాలకు తాళ్ళపాలెం తేగలు తరలిస్తుంటారు. సంక్రాంతి పండుగకు వచ్చిన ఇతర ప్రాంతాల వారు కూడా ఈ తేగలను తీసుకెళ్తుంటారు. భూమి తీరు, తేగలు కాల్చడం వల్ల మంచి రుచి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. వంద తేగలు సైజును బట్టి రూ.500-600 వరకు విక్రయిస్తున్నారు. గణపవరం, పిప్పర వంటి ప్రధాన కేంద్రాల్లో కూడా రహదారులు వెంబడి విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో స్థానికంగా అనేక మంది తోపుడు బళ్ళ మీద, సైకిళ్ళు, మోటారు సైకిళ్లపై కూడా నగరాలకు, పల్లెల్లోనూ విక్రయిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు.



ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం టౌన్, జనవరి 21 : మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నరసాపురంకు చెందిన ఆదిపరాశక్తి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో వలవల అనంత లక్ష్మీదేవి పర్యవేక్షణలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నది. దాదాపు రెండు గంటల పాటు కీర్తనలకు, జనపద గీతాలకు చిన్నారులు, కళాకారులు చేసిన నాట్యం రంజిపంజేసింది. అనంతరం కళాకారులను ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. మధ్యాహ్నం 3 గంటలకు భజన, సాయంత్రం 4గంటలకు అన్నమాచార్య కీర్తనలు, రాత్రి 7 గంటలకు మావుళ్ళమ్మ నాట్య మండలి ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర నాటకం నిర్వహించారు.

నేడు మావుళ్ళమ్మ ఉత్సవాల్లో...

మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3గంటలకు బాల మురళీకృష్ణ భక్త సమాజం బోడపాడు వారిచే భజన, సాయంత్రం 4గంటలకు భగవత్ పారాయణ, సాయంత్రం5 గంటలకు దనుకొండ లిఖిత బృందం కొవ్వూరు వారిచే కూచిపూడి నత్యప్రదర్శన సాయంత్రం6 గంటలకు రాజు ఆర్కెస్ట్రా అండ్ ఈ వెంట్స్ వారిచే సినీ మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు రాజజయసుందరరాజు (బాపిరాజు) నాగిడిపాలెం వారిచే సత్యహరిశ్చంద్ర కాటిసీను ఏకపాత్ర, రాత్రి 8-30 గంటలకు శ్రీకృష్ణతులాభారం నాటకం.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

అత్తిలి, జనవరి 21 : గుమ్మంపాడులో లక్ష్మీనరసింహ స్వామికి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. జనసేన తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన నిర్వాహకుడు పులవర్తి రవీంద్ర ఫణిగోపాల్, అర్చకుడు శ్రీహరి గోపాల్, గిరిజ, పులవర్తి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. అన్నదానం జరిగింది.

ముగిసిన క్రీడలు

నరసాపురం రూరల్, జనవరి 21: ఎల్‌బీచర్లలో ఆదివారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగిశాయి. చివరి ముగింపు సభకు రాష్ట్ర మత్స్యకార సొసైటీ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఎంపీపీ సోని ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వేములదీవి క్రికెట్, వాలీబాల్‌లో వేములదీవి తూర్పు, కబడ్డీ సీతారాంపురం, కోకోలో చామకూరిపాలెం, బ్యాడ్మింటన్‌లో లక్ష్మణేశ్వరం సచివాలయ జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీడీవో వీరభద్రరావు, ఈవోపీఆర్డీ శర్మ, సిబ్బంది సురేష్‌లు పాల్గొన్నారు.

సోషలిస్టు యోధుడు లెనిన్‌కు నివాళులు

భీమవరం అర్బన్, జనవరి 21: సోషలిస్టు సమాజ స్థాపనకు బాటలు వేసిన విప్లవకారుడు లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సోషలిస్టు విప్లవ యోధుడు లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం శ్రీనివాస సెంటర్‌లోని సీపీఐ స్థూపం వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా నాయకులు సీహెచ్ రంగారావు, ఎం.సీతారాం ప్రసాదు, మల్లుల శ్రీనివాస్, మల్లేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు.

జనసేనలో చేరికలు

తణుకు, జనవరి 21: పైడిపర్రులో పలువురు జనసేనలో చేరారు. ఆదివారం సాయంత్రం కురసాల శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, వడ్డి నరసింహమూర్తి, కొర్ల సత్తిపండు ఆధ్వర్యంలో జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు శ్రీనివాసు, ఆకేటి కాశీ, పుచ్చల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పెంటపాడు, జనవరి 21: మండలంలోని ఆకుతీగపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొల్లూరి నాగరాజు తన తండ్రి శేషగిరి స్మృత్యర్థం ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వార్డు సభ్యుడు ఇర్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 21: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలందించారు. డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర ఆదివారం తణుకు, వేల్పూరుల్లో పర్యటించి ఆరుగురికి వైద్య పరీక్షలు చేసి పాతూరి శివన్నారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. సంఘ కార్యదర్శి కోడూరి సత్యనారాయణ, కోశాధికారి అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్తకులు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, జనవరి 21: వర్తకులు ఆర్థికంగా ఎదగాలని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కిళ్ళీ, బీడీ, సిగరెట్, సోడా, కూల్ డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడిగా బోయిడి అన్నవరం, అధ్యక్షుడిగా పైబోయిన ఏసుబాబు, కార్యదర్శిగా గమిడి జయరామ వెంకట సుబ్బారావు, కోశాధికారిగా కొమ్మన రాంబాబుతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు, బలగం సీతారామ్, అన్నెం మురళీకృష్ణ, మల్లిన రాధాకృష్ణ, గుమ్మళ్ళ హనుమంతు, ఆనాల ఆదినారాయణ, కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐ బదిలీ

భీమవరం క్రైం, జనవరి 21 : భీమవరం ఎస్ఈబీ సీఐగా ఈ.స్వరాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ వెస్ట్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు రాగా ఇప్పటి వరకు భీమవరంలో పనిచేసిన సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ భవానీపురం ఎస్ఈబీ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

రామాలయాలు ముస్తాబు

ఆచంట, జనవరి 21: అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల రామాలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు భజన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల అన్న సమారాధ నిర్వహంచనున్నారు. దీంతోపలు చోట్ల పండుగ వాతావరణం నెలకొన్నది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో స్వామి వారి అక్షింతలు పంపిణీ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

గణపవరం, జనవరి 21: అయోధ్యలో రామ మందిర ప్రారం భోత్సవం సందర్భంగా ఆదివారం గణపవరం మండల గ్రామాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరంలోని దండు మారెమ్మ ఆలయం వద్ద అయోధ్య రాముడితో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఏ విఘ్నంలేకుండా విగ్రహ ప్రతిష్ఠ జరగాలని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సువర్చల సమేత ఆంజనేయస్వామి ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. పిప్పర శివాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం జరిగే ప్రత్యేక పూజలకు భక్తులందరూ పాల్గొనాలని తెలిపారు.

ముగిసిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



పురుషుల విభాగం విజేతకు కప్ అందిస్తున్న కొత్తపల్లి

నరసాపురం, జనవరి 20; పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి స్త్రీ పరుషులు కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. హోరా హోరీగా సాగిన పురుషుల విభాగం ఫైనల్స్‌లో హర్యానా విన్నర్‌గా, రాజస్థాన్‌గా రన్నర్‌గాను, మూడో స్థానంలో ఆంధ్ర, నాల్గో స్థానంలో వెస్ట్ బెంగాల్ జట్లు నిలించాయి.

మహిళా విభాగంలో విన్నర్‌గా కోల్‌కతా, రన్నర్‌గా కేరళ జట్లు నిలిచాయి. తృతీయ స్థానంలో ఆంధ్ర, నాల్గో స్థానంలో హిమాచల్‌ప్రదేశ్ నిలించాయి. విజేతలకు ఐదు లక్షలు ప్రైజ్ మనీతో పాటు షీల్డ్‌లను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కొవ్వలి నాయుడు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, బాబుశ్రీ, దొండపాటి స్వామి, నెక్కంటి సుబ్బారావు, వీరలంకయ్యలు అందించారు.









టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలతో సమావేశమైన సీతారామలక్ష్మి.. విస్సాకోడేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు.. దొంగరావిపాలెంలో పర్యటిస్తున్న పితాని.. నరసాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

‘నాసిరకం మద్యంతో ప్రాణాలతో చెలగాటం’

భీమవరం అర్బన్, జనవరి 21: నేను ఉన్నాను నేను విన్నాను ఒక్క చాన్స్ ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆరోపించారు. భీమవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం సోషల్ మీడియా ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. జగన్ పాలనలో ఆదాయం పెరగలేదని నిరుద్యోగ యువతకు జాబ్‌క్యాలెండర్ లేకుండా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. జగన్ తన సొంత బ్రాండ్లతో దుకాణాలలో నాసిరకం మద్యంతో సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి మిర్తిపాటి గుణేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గూడురి సుబ్బారావు, ఉప్పలూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కోసమే టీడీపీ-జనసేన పొత్తు

పాలకోడేరు, జనవరి 21 : తెలుగుదేశం జనసేన పొత్తు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసమేనని రానున్న ఎన్నికల్లో రెండు పార్టీల కలయికతో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. విస్సాకోడేరులో ఇంటింటికి తెలుగుదేశం, జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముందు భీమవరం శివారు నుంచి విస్సాకోడేరు శివారు వరకు సుమారు 3 కిలో మీటర్లు జాతీయ రహదారిపై టీడీపీ, జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి ఇంటింటికి ఎమ్మెల్యే రామరాజు తిరుగుతూ తెలుగుదేశం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి రాగూర్ కోటేశ్వరరాజు, ఉండి నియోజకవర్గ బీసీ నాయకుడు కామన రాంబాబు, నడిపూడి అప్పారావు, ఆరేపల్లి నాగరాజు, లక్ష్మీ, సాలా మల్లేశ్వరరావు, దొంగ కృష్ణ, వీరవల్లి వెంకటలక్ష్మీ, తెలుగు యువత నాయకుడు అశోక్, వెంకటేష్, గుల్లిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

దొంగరావిపాలెంలో పితాని పాదయాత్ర

పెనుగొండ, జనవరి 21: దొంగరావిపాలెంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదివారం ఎన్నికల శంఖారావం పూరిస్తూ పాదయాత్ర చేపట్టారు. ముందుగా నాగదేవత, కొండాలమ్మ, కనకదుర్గమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. దొంగరావిపాలెం బీసీ ఏరియాలో సుమారుగా 15 మంది యువకులు పితాని సమక్షంలో పార్టీలో చేరారు. బాపినీడు కాలనీలో పితానికి ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, దొంగరావిపాలెం సర్పంచ్ కోన రామలింగేశ్వరరావు, వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ చింతపల్లి గనిరాజు, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోని పాల్గొన్నారు.

‘దళితుల్ని అణచివేస్తున్న వైసీపీ’

నరసాపురం, జనవరి 21: వైసీపీ ప్రభుత్వం నియంతృత్వ పాలనతో దళితుల్ని అణిచివేస్తుందని టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి ఆరోపించారు. ఆదివారం ఆమె నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలుపు కోసం జగన్ కోడికత్తి డ్రామా ఆడారన్నారు. ఈ కేసులో దళిత బిడ్డ శ్రీనును బలిపశువుని చేశారన్నారు. తల్లిని, చెల్లిని స్వలాభం కోసం వాడుకుని వదిలేసిన స్వార్థపరుడు జగన్ అని మండిపడ్డారు.

చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్

తణుకు, జనవరి 21: చంద్రబాబుతోనే తమకు భవిష్యత్ అని భావించి యువత పెద్ద ఎత్తున టీడీపీలో చేరడం అభినందనీయని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తణుకులోని ఆయన నివాసంలో పట్టణానికి చెందిన 70 మంది యువకులు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకటకృష్ణ, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, బట్టపల్లి నాగరాజు, గుత్తుల రంగారావు పాల్గొన్నారు.

కోడికత్తి శ్రీనుకు మద్దతుగా ఆందోళన

అత్తిలి, జనవరి 21: కోడికత్తి శ్రీనును ఐదేళ్లుగా జైలులో ఉంచడం దారుణమని టీడీపీ నాయకులు అనాల ఆదినారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేలి చిట్టిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అత్తిలి బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ సెంటర్ వద్ద కోడికత్తి శ్రీనుకు మద్దతుగా ఆందోళన చేపట్టారు. తక్షణమే శ్రీనుకు బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మేడపాటి బాలకృష్ణ, రాజు, కె. దయానందమూర్తి, ఎం. సుధాకర్, కె. శ్రీను, నేలపాటి జాన్సన్, నార్కిమిల్లి వెంకటరాజు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



అలంకరణలో దానేశ్వరమ్మ

ఆకివీడు, జనవరి 21: దానేశ్వరమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అష్టోత్తర శత కలశ అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు, పుష్పోత్సవం నిర్వహించారు. భక్తులు మాతను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారు జలదుర్గ ప్రసాద్, కార్యదర్శి జంగారెడ్డి రఘురామ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అండ ఆదిపరాశక్తి

ఆకివీడు, జనవరి 21: నమ్మిన భక్తులకు అండగా నిలిచేది ఆదిపరాశక్తి అని నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, గురుస్వామి జగన్ అన్నారు. ఆదివారం వేణుగోపాలస్వామి దేవస్థానం సమీపంలోని ఖాళీ స్థలంలో సుమారు వెయ్యి మంది భక్తులు ఇరుముడులు ధరించి ర్యాలీగా మేల్ మరుత్తూర్‌కు బయలుదేరారు. ఈ నెల 18న భక్తులు ఆదిపరాశక్తి మాలలు ధరించి ప్రత్యేక పూజలు చేశారన్నారు. ఆదిపరాశక్తిని దర్శించుకొని బుధవారం ఆకివీడు తిరిగి రావడం జరుగుతుందన్నారు.

నేడు మాదివాడలో నగర సంకీర్తన

ఆకివీడు, జనవరి 21: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మాదివాడ మల్లేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి దేవస్థానాల దగ్గర భక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాదివాడ కోదండరామాలయంలో సోమవారం పంచామృతాలతో క్షీరాభిషేకం, సహస్ర పూజలు, పారాయణం, నగర సంకీర్తన, ఆంజనేయుడికి తమలపాకుల పూజ జరుగుతుందని అర్చకులు తెలిపారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు, జనవరి 21: గ్రంథాలయ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమవతి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అన్నారు. పెంటపాడు నక్కా వెంకటేశ్వరరావు మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఆదివారం రీడర్స్‌కు అందజేశారు. రాష్ట్ర రైతు కార్యాచరణ కమిటీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయానందరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కర్రి వరహాల రెడ్డి, డాక్టర్ భాను సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి జనసేన అండ



బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు, జనవరి 21: ఆపదలో ఉన్న వారికి జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రత్తిపాడులో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆదివారం రూ. 10 వేలు నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తొలుత ప్రత్తిపాడులో జనసేన నాయకుడు జగత్ సోమశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది జనసేనలో చేరగా వారికి బొలిశెట్టి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. బొలిశెట్టి రాజేష్, వర్దనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, అత్తిలి బాబి, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

గణపవరం, జనవరి 21: ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఆదివారం బాధ్యతలు స్వీకరించడంతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. షర్మిల రాకతో అధికార పార్టీ వైసీపీలో గుబులుపుట్టిందన్నారు. ఈనెల 23 నుంచి జిల్లాల వారీగా పర్యటిస్తామని ప్రకటించడం ఆంధ్రాలో కాంగ్రెస్ బలోపేతానికి నిదర్శనమన్నారు.

నాలుగో రోజూ సెల్‌టవర్ పైనే..



సెల్‌టవర్‌పైన సెల్ఫీ తీసుకున్న ఏసు

భీమవరం క్రైం, జనవరి 21 : తనకు రావల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ నాలుగు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైకి ఎక్కి నిరసన తెలుపుతున్నాడు. చినఅమిరానికి చెందిన ఏసు తన తండ్రికి సంబంధించిన ఇన్సూరెన్స్ ఇప్పించాలని కొన్నేళ్లుగా స్థానిక ఎస్‌బీఐను సంప్రదిస్తున్నాడు. బ్యాంకు సిబ్బంది తక్కువ ఇన్సూరెన్స్ ఇవ్వడానికి నిర్ణయించారని, తనకు అన్యాయం జరుగుతుందంటూ ఏసు బ్యాంకు నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన చినఅమిరంలో బ్యాంకు సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కాడు. తన సమస్య పరిష్కరించే వరకు సెల్ టవర్ దిగనని భీష్మించాడు. అప్పటి నుంచి సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి ఆదివారం రాత్రి కూడా దిగలేదు. పోలీసులు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా కూడా అతను కిందకు దిగడం లేదు. అయితే నాలుగు రోజులుగా ఆహార పానీయాలు లేకుండా సెల్‌టవర్ పైనే ఉండటం గమనార్హం. ఇదిలావుండగా సెల్‌టవర్ పైనుంచి తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన సెల్ చార్జింగ్ అయిపోతున్నదని, పవర్ బ్యాంకు కావాలని, తనకు ఏదైనా జరిగితే డీఎస్పీదే బాధ్యత అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు.



అమ్మవారి లడ్డును వేలంలో పాడుకున్న భక్తుడికి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు

ముగిసిన జాతర.. అన్న సమారాధన

మొగల్తూరు, జనవరి 21: పేరుపాలెం సౌత్ గ్రామంలో బందరు మొగదారమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర పురస్కరించుకుని అమ్మవారికి సత్తినేని రామకృష్ణ సత్యవతి దంపతులు సమర్పించిన 18 కిలోల లడ్డును ఆదివారం వేలం నిర్వహించగా పేరుపాలెం పెద్దిరాజు రూ.32వేలకు దక్కించుకున్నారు. అమ్మవారికి 4 కిలోల వెండి కిరీటాన్ని బహూకరించిన కత్తుల కృష్ణను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు సత్కరించారు.

ఘనంగా సత్తెమ్మ జాతర



సత్తెమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు, జనవరి 21: మొగల్తూరులోని సత్తెమ్మ అమ్మవారి జాతరను ఆదివారం రెండు చోట్ల ఘనంగా నిర్వహించారు. వెలిదివారి వీధిలోని అమ్మవారి ఆలయం వద్ద వేకువజామునుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే కెనాల్ రోడ్డులోని ప్రత్యేకంగా అమ్మవారిని నిలబెట్టి మరికొన్ని కుటుంబాలు జాతర మహోత్సవాలను బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులుతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర నిర్వహించే రెండు ప్రాంతాల్లోనూ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మానసిక ప్రశాంతతకు కళారూపాలు దోహదం



ఎమ్మెల్యే రామానాయుడుని సత్కరిస్తున్న నిర్వాహకులు

పాలకొల్లు టౌన్, జనవరి 21: మానసిక ప్రశాంతతకు కళారూపాలు దోహదపడతాయని ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. లయన్స్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం చిత్ర కళాప్రదర్శన, స్పాట్ పెయింటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏటా చిత్ర కళా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మలను నిర్వాహకులు సత్కరించారు. ఈకార్యక్రమంలో వపా బాపు ఆర్ట్ అకాడమీ , లయన్స్ కమ్యూనిటీ హాల్ సభ్యులు పాల్గొన్నారు.

సేవలు కొనసాగించాలి

అత్తిలి, జనవరి 21: లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగించి క్లబ్‌కు మంచి పేరు తేవాలని అత్తిలి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సింగలూరి చంద్రశేఖర్ అన్నారు. అత్తిలి లయన్స్ క్లబ్‌లో గతంలో పనిచేసిన అధ్యక్షులను సత్కరించారు. క్లబ్‌ప్రతినిధులు దాసం బాబ్జి, మద్దాల వెంకటేశ్వరరావు, టి.జయ సూర్య ఉలుసు బాస్కరరావు పాల్గొన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా సెమినార్ నిర్వహించారు.

హనుమాన్ చాలీసా పారాయణ.. శోభాయాత్ర

అత్తిలి, జనవరి 21 : అత్తిలి హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. అర్చకులు సీహెచ్ వెంకట సదాశివ, వాడపల్లి సూర్య తేజ తదితరులు అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాలురు హనుమాన్ వేషధారణతో అలరించారు. శ్రీరామ్ నినాదంతో శోభాయాత్రను నిర్వహించారు.



భీమవరంలో అంగన్‌వాడీలకు సీఐటీయూ నాయకుల మద్దతు

అంగన్‌వాడీల నిరసన

భీమవరం అర్బన్/వీరవాసరం/ఉండి, జనవరి 21: జగనన్న నిన్ను గెలిపించి తప్పు చేశామంటూ చెంపల్ని చేతులతో కొట్టుకుంటూ భీమవరంలో అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి రామయ్య పాల్గొన్నారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో అంగన్వాడీలు విప్లవనేత లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉండిలో తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన కొనసాగింది.

వైభవంగా ఆదిలక్ష్మి గ్రామోత్సవం



గజమాలలో ఆదిలక్ష్మి అమ్మవారు

భీమవరం,టౌన్, జనవరి 21 : గునుపూడి గ్రామ దేవత శ్రీ ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ జాతర ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. మహానివేదన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి ఉత్సమూర్తిని ఉంచి బాణసంచా కాల్పులు, ఆసాదుల నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. జబర్దస్తనటుడు పంచ్ ప్రసాద్, అల్లు శ్రీనివాస్, రజక యూత్ అసోసియేషన్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, జనవరి 21: ప్రశిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రాముడి ప్రతిష్ఠ ఎంతో ఆనందంగా ఉంది



కుందూరు వెంకట రమేష్ (1990లో కరసేవకుడు)

అయోధ్యలో రామ మందిర నిర్మాణం ఎంతో సంతృప్తిని కలిగిస్తోంది. 1990లో విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు అయోధ్యలో కరసేవకుల సమావేశానికి ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి 77 మంది కరసేవకులు వివిధ మార్గాల ద్వారా విజయవాడకు చేరుకుని అక్కడి నుంచి అయోధ్యకు బయలు దేరాం. అయితే అప్పటి ములాయంసింగ్ ప్రభుత్వం ఆంక్షలతో ఇబ్బందులు పడ్డాం. దాదాపు 100 నుంచి 150 కిలో మీటర్లు నడచి సరయు నది వద్ద ఉన్న ఫైజియాబాద్ చేరుకున్నాం. అక్కడ వంతెనపై ఉండగా కాల్పులు జరపటంతో చాలామంది కరసేవకులు చనిపోయారు. బ్రిడ్జి పైనుంచి నదిలో పడిపోయారు. తనకు కూడా గాయాలు కావటంతో పోలీసులు అరెస్టు చేశారు. చివరకు పూచికత్తుతో తిరిగి జిల్లాకు వచ్చేశాం. తరువాత 1992లో జరిగిన కరసేవకు వెళ్ళలేదనే బాధ ఇప్పటికీ ఉంది. ఇనాళ్ళకు తాము అనుకున్న రామాలయం నిర్మాణం జరగటం, విగ్రహ ప్రతిష్ఠ జరగటం సంతృప్తినిస్తోంది. ఇది జరగటానికి ప్రధాని నరేంద్రమోదీ వల్లనే జరిగిందనే చెప్పవచ్చు. లేకపోతే ఎప్పటికీ ఆ ఆశ నెరవేరే అవకాశాలు ఉండేవి కావు.

- భీమవరం టౌన్

కృష్ణంరాజు సతీమణికి అక్షింతల అందజేత

భీమవరం టౌన్, జనవరి 21 : శ్రీరామచంద్రుని ఆశీస్సులు అందరికీ ఉండాలని, 500 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో నేడు సిద్ధించుకోగలిగి రాముని విగ్రహ ప్రతిష్ఠ చేసుకుంటున్నామని దివంగత సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల దేవి అన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, బి.సత్యనారాయణ ఆదివారం మొగల్తూరులోని కృష్ణంరాజు ఇంటికి వెళ్ళి అయోధ్య శ్రీరాముని అక్షింతలు చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కృష్ణంరాజు ఎంపీగా ఉండగా ఈ రామమందిరం విషయంపై మద్దతుతో ఉండేవారని ఆమె అన్నారు.

సూర్యారావు మృతికి సంతాపం

భీమవరం టౌన్, జనవరి 21 : రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ ఎన్.మోహన్ రావు తండ్రి నేతల సూర్యారావు (91) కేపీపాలెంలో మృతి చెందారు. నేతల సూర్యారావు భౌతికకాయాన్ని జిల్లా రిటైర్డ్‌ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల్ జేమ్స్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రాజు, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఆదారి గణేష్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవివర్మ, జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పాండురంగారావు సందర్శించి నివాళులర్పించారు.

హ్యాండ్ వాషింగ్ మిషన్ ప్రారంభం

భీమవరం టౌన్, జనవరి 21 : మునిసిపల్ కార్యాలయంలో హ్యాండ్ వాషింగ్ మిషన్‌ను శనివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామల, సిటీ మిషన్ మేనేజరు సీహెచ్ నాని బాబు పాల్గొన్నారు.

కేజీఆర్ఎల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భీమవరం రూరల్, జనవరి 21 : కేజీఆర్ఎల్ కళాశాల 1988 - 93 ఇంటర్, డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం రాయలం గ్రామంలో నిర్వహించారు. కూనపరెడ్డి ప్రసాద్, గూడూరు బాల మురళికృష్ణ ఆధ్వర్యంలో ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

గడ్డివాము దగ్ధం



ఆచంట, జనవరి 21: కొడమంచిలి చినపేటకు చెందిన పుచ్చకాయల జయకృష్ణ ఎనిమిది ఎకరాల గడ్డి వాము దగ్ధమైంది. సుమారు 50 వేల రూపాయలు విలువ గల గడ్డి దగ్ధమైందని తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.